నమస్తే తెలంగాణ
నిర్మల్
5 | నిజామాబాద్, బుధవారం 21 ఫిబ్రవరి 2024 | NIRMAL

ఆలయ భూములను ఆక్రమిస్తే చర్యలు

ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 20 : నిర్మల్ పట్టణంలోని ప్రియదర్శిని నగర్ కాలనీలో గల ఉదాసీ మఠం ఆలయ భూములను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని దేవాదాయ శాఖ డివిజన్ ఇన్స్పెక్టర్ రంగు రవికిషన్ తెలిపారు. కాలనీలోని ఉదాసీ మఠం ఆలయ భూముల సర్వే నంబర్ 1866లో సోమవారం రాత్రి కొందరు స్థలాన్ని ఆక్రమించి ప్రహరీ, బేస్ మెంట్ కట్టడంతో అప్రమత్తమైన ఆలయ అధికారులు మంగళవారం వరంగల్ జోన్ ఉప కమిషనర్, సహాయ కమిషనర్ ఆదేశాల మేరకు ఆక్రమణలను జేసీబీతో తొలగించారు. ఆలయ భూముల రక్షణకు గట్టి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

రెండో రోజు శిక్షణ

అవగాహన కల్పిస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌వో గజానన్

ఎదులాపురం, ఫిబ్రవరి 20 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయ సమావేశ మందిరంలో ఆన్‌లైన్ పోర్టల్‌పై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం మంగళవారానికి రెండో రోజుకు చేరుకున్నది. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, సూపర్‌వైజర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు అడిషనల్ డీఎంహెచ్‌వో గజానన్ పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఎయిడ్స్, లైంగిక సంబంధ వ్యాధుల గురించి వివరించారు. ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసే విధానాన్ని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చూపించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డిప్యూటీ పారా మెడికల్ అధికారి వామన్‌రావు, డీడీఎం రమణ, సిబ్బంది సతీశ్, రాజశేఖర్, అలీ, రమణాచారి పాల్గొన్నారు.

రైల్వేలైన్ సాధన సమితి సభ్యులకు మద్దతు తెలుపుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామన్న

బీఆర్ఎస్ మద్దతు

- రైల్వేలైన్ సాధన సమితి దీక్షకు సంఘీభావం ప్రకటించిన మాజీ మంత్రి రామన్న
- సాధించేంత వరకు మద్దతు ఉంటుందని హామీ

ఎదులాపురం, ఫిబ్రవరి 20 : ఆదిలాబాద్ టు ఆర్మూర్ రైల్వే లైన్ పనులు చేయాలని గతంలో బీజేపీ ప్రభుత్వానికి వినతులు సమర్పించినా ఫలితం లేదని, డీపీఆర్(డిటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు) ఇవ్వకుండా కేవలం జీవోను విడుదల చేశారని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. రైల్వే లైన్ సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 36వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలకు బీఆర్ఎస్ పార్టీ తరపున సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రాజెక్ట్ రిపోర్ట్ ఇవ్వకుండా జీవో విడుదల చేసిన కేంద్రం.. ఆ తర్వాత పనులను పూర్తిగా విస్మరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కారణంగానే పనులు నిలిచిపోయాయని, బీజేపీ నేతలు ఆరోపణలు చేస్తుండడంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రైల్వే లైన్ సాధించేంత వరకు తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ దీక్షలో సాధన సమితి చైర్మన్ నారాయణ, కార్యదర్శి నరేందర్, బీఆర్ఎస్ నాయకులు విజ్జగిరి నారాయణ, రోకండ్ల రమేశ్, మెట్టు ప్రహ్లాద్, వార్డు కౌన్సిలర్లు సంద నర్సింగ్, అశోక్ స్వామి, బండారి సతీశ్, వెంకన్న ఉన్నారు.

పాల పైసలు రావట్లేదు..

రైతులకు డబ్బులు చెల్లించని విజయ డెయిరీ



- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిలిచిన రూ.1.60 కోట్లు
- 3,113 మంది రైతులకు అందని డబ్బులు
- పైసలు త్వరగా చెల్లించాలని రైతన్నల వేడుకోలు

ఆదిలాబాద్‌లోని విజయ డెయిరీ

ఆదిలాబాద్, ఫిబ్రవరి 20(నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ (విజయ డెయిరీ) రైతుల నుంచి పాలను సేకరించి డబ్బులు చెల్లిస్తున్నది. దీంతో రైతులు వ్యవసాయంతోపాటు బర్రెలు, ఆవులను పెంచుకుంటూ పాలను విక్రయిస్తున్నారు. విజయ డెయిరీ ఆధ్వర్యంలో అధికారులు రైతుల నుంచి ఉదయం, సాయంత్రం పాలను సేకరిస్తారు. పాలలో వెన్నెశాతం ఆధారంగా డబ్బులను చెల్లిస్తారు. ప్రతి పక్షం రోజులకు ఒకసారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి. ఈ వ్యాపారం బాగుండడంతో అన్నదాతలు బ్యాంకులు, ఇతర సంస్థల్లో రుణాలు తీసుకుని పశువులను కొనుగోలు చేసి డెయిరీ ఫాంలు ఏర్పాటు చేసుకున్నారు. మేలు రకం పశువులకు మంచి ధర చెల్లించి మన రాష్ట్రంతోపాటు ఆంధ్రప్రదేశ్, హర్యాన, రాజస్థాన్, బిహార్ రాష్ట్రాల నుంచి కొనుగోలు చేసి తీసుకొస్తారు. బిహార్ రాష్ట్రానికి చెందిన వారిని కూలీలుగా నియమించుకుంటారు. రోజు విజయ డెయిరీకి పాలను విక్రయించి ఉపాధి పొందుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 3,113 మంది పాడి రైతులు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా విజయ డెయిరీ ఆధ్వర్యంలో తొమ్మిది పాల సేకరణ కేంద్రాలు నడుస్తున్నాయి. ఆదిలాబాద్, నిర్మల్, లక్షెట్టిపేట, కడెం, దహెగాం, బెల్లంపల్లి, ఆసిఫాబాద్, ఇచ్చోడ, బేల మండలాల్లో ఉన్నాయి. వీటిల్లో 3,113 మంది రైతులు పాలు పోస్తూ ఉపాధి పొందుతున్నారు. తొమ్మిది కేంద్రాల్లో రోజు 11 వేల లీటర్ల పాల సేకరణ జరుగుతున్నది. అమ్మిన పాలకు సంబంధించిన డబ్బులు 15 రోజులకు ఒకసారి రైతుల బ్యాంకు ఖాతాల్లో విజయ డెయిరీ ప్రధాన కార్యాలయం నుంచి జమవుతాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.80 లక్షలను రైతులకు చెల్లించాల్సి ఉంది. మూడు రోజుల క్రితం వరకు 45 రోజులకు సంబంధించిన డబ్బులు రాకపోగా, రెండు రోజుల క్రితం జనవరి 1 నుంచి 15 వరకు పాల డబ్బులు వచ్చాయి. ఇంకా నెల రోజులకు సంబంధించిన రూ.1.60 కోట్లు రావాల్సి ఉంది. పాల పైసలు రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. డెయిరీల నిర్వహణ భారంగా మారుతున్నదని అంటున్నారు. పని చేసే వారికి వేతనం, పశువులకు దాణా, ఇతర ఖర్చుల కోసం అప్పులు చేయాల్సి వస్తున్నదని ఆవేదన చెందుతున్నారు. పాల పైసల విషయంలో అధికారులను అడిగితే హైదరాబాద్ హెడ్ ఆఫీసు నుంచి పైసలు వస్తాయని, తమ వద్ద ఏమీ లేదని సమాధానం ఇస్తున్నారని రైతులు తెలిపారు. అధికారులు స్పందించి తమకు రావాల్సిన పైసలు ప్రతి 15 రోజులకు ఒకసారి ఇప్పించాలని కోరుతున్నారు.

నేటి నుంచి గజ్జలమ్మ వార్షికోత్సవ వేడుకలు

- 23వ తేదీ వరకు కొనసాగనున్న జాతర
- ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం
- 11 రోజులపాటు దీక్షలు

కుంటాల, ఫిబ్రవరి 20 : గజ్జలమ్మ ఆలయానాలుగో వార్షికోత్సవ వేడుకలు(21, 22, 23) తేదీల్లో కొనసాగనున్నాయి. వేద పండితుడు చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో 21వ తేదీ భగవతి ప్రార్థన, విశేష సంకల్పం, మహాగణపతి పూజ, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠ, స్థాపిత దేవతా హోమం, కుంకుమార్చన.. 22వ తేదీన నిత్యనిధి, యజ్ఞ కార్యక్రమం, శ్రీ గజ్జలమ్మ కల్యాణం, రథోత్సవం, మంత్ర పుష్పం.. 23వ తేదీన మహాపూర్ణహారతి, కుంబాభిషేకం, బోనాల పండుగ పూజా కార్యక్రమాలు కొనసాగుతాయి. మూడు రోజులపాటు భక్తులకు అన్నదానం కొనసాగనుంది. ఈ సందర్భంగా భక్తులు 11 రోజులపాటు దీక్షలు చేపడుతారు. అధికారులు కూడా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

గజ్జలమ్మ దీక్షలు చేపట్టిన భక్తులు

మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

పాల్గొన్న ప్రజలు

సమ సమాజ నిర్మాణానికి పాటు పడాలి..

సేవాలాల్ జయంతి వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 20 : మహనీయులు చూపిన మార్గంలో నడుస్తూ సమ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు పాటు పడాలని మాజీ మంత్రి జోగు రామన్న స్పష్టం చేశారు. మంగళవారం బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. పట్టణంలోని రాంలీలా మైదానంలో ఏర్పాటు చేసిన అధికారిక వేడుకలకు జిల్లాస్థాయి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతోపాటు భారీ సంఖ్యలో బంజారాలు హాజరు కావడంతో సందడి నెలకొంది. బంజారా మహిళలు సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబించేలా తమదైన వస్త్రధారణతో హాజరు కావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ రాహుల్‌రాజ్, జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, వెడ్మ బొజ్జు పటేల్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ముందుగా దుర్గా మాత, సంత్ సేవాలాల్ చిత్రపటాల వద్ద పూజలు చేసిన అనంతరం భోగ్ బండార్ నిర్వహించారు. బంజారాలు సంస్కృతికి అద్దం పట్టే గీతాలకు అనుగుణంగా నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ.. సేవాలాల్ మహారాజ్ సందేశాలను ప్రచారం చేయాలని, తద్వారా సమాజం అభ్యున్నతి సాధిస్తున్నదని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మహనీయుల జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహిస్తూ వారి సేవలను స్మరించుకుంటున్నామని తెలిపారు. సంఘటితంగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నగేశ్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్, స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ ఖుష్బూ గుప్తా పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న బంజారా మహిళలు

ఎంపీ పూజలు

బాసర, ఫిబ్రవరి 20 : బాసర జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో మంగళవారం ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే రామారావు పటేల్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డిలకు అధికారులు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విజయసంకల్ప యత్ర బస్సులను ప్రారంభించారు. ఈయన వెంట బీజేపీ నాయకులున్నారు.

విజయ సంకల్ప యాత్రను ప్రారంభిస్తున్న ఎంపీ బాపురావ్

కేంద్ర బృందం సందర్శన

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 20 : నిర్మల్ ఆసుపత్రిలోని బ్లడ్ బ్యాంకును కేంద్ర బృందం సందర్శించింది. నిర్మల్ ఆసుపత్రికి సింగిల్ డోనర్ ప్లేట్‌లేట్ మిషన్ మంజూరు కాగా అనుమతికి కేంద్ర బృందం మంగళవారం ఆసుపత్రికి వచ్చారు. డ్రగ్ ఇన్స్పెక్టర్ మిట్టపల్లి శ్రీధర్, బృంద సభ్యులు బ్లడ్ బ్యాంకులోని రికార్డులు, బ్లడ్ బ్యాంకులో రక్తం నిల్వ చేసేందుకు తీసుకుంటున్న ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ సునీల్ రాథోడ్, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ కుమార్, డ్రగ్ ఇన్స్పెక్టర్ శ్రీలత, బ్లడ్ బ్యాంక్ వైద్యాధికారి మాధవి ఉన్నారు.

నిర్మల్ ఆసుపత్రిని సందర్శించిన సభ్యులు

ఆర్జీయూకేటీ విద్యార్థుల క్షేత్ర పర్యటన

బాసర, ఫిబ్రవరి 20 : బాసర ఆర్జీయూకేటీ విద్యార్థులు బుధవారం క్షేత్ర పర్యటనకు వెళ్లారు. ఇందులో భాగంగా కామారెడ్డి జిల్లాలోని గాయత్రి షుగర్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను సందర్శించారు. ఇంజినీరింగ్ విభాగం తృతీయ సంవత్సరం విద్యార్థులు అందులో ఉన్న యూనిట్ ఆపరేషన్స్‌ని పరిశీలించారు. ఇథనాల్ ఎలా ఉత్పత్తి అవుతుందనే విషయాన్ని తెలుసుకున్నారు.
కెమికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి వినయ్ కుమార్ క్షేత్రస్థాయి పర్యటనపై అవగాహన కల్పించారు.

క్షేత్ర పర్యటనలో పాల్గొన్న విద్యార్థులు

ప్రభుత్వ డాక్టర్.. 'ప్రైవేట్' విధులు

- సర్కారు జీతం తీసుకుంటూ.. 20 ఏళ్లుగా 'శ్రీ కిరణ్ ఆసుపత్రి'లో పని
- కేసులున్నప్పుడు, మీటింగ్‌లకు మాత్రమే వస్తారంటున్న సిబ్బంది
- బాలింత మృతితో వెలుగులోకి మరిన్ని విషయాలు

మంచిర్యాల ఎంసీహెచ్‌లో పీపీ యూనిట్ ఇన్‌చార్జిగా కొనసాగుతున్న అరుణశ్రీ

మంచిర్యాల, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : చెన్నూర్‌లోని శ్రీ కిరణ్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో సోమవారం వైద్యం వికటించి బాలింత మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా.. ఆ మృతురాలికి డెలివరీ చేసిన డాక్టర్ అరుణశ్రీ ప్రభుత్వ వైద్యురాలు కావడం గమనార్హం. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మాతాశిశు ఆసుపత్రి(ఎంసీహెచ్)లో పీపీ యూనిట్ ఇన్‌చార్జి వైద్యురాలు. ఏ ప్రభుత్వ వైద్యురాలైన డ్యూటీ సరిగ్గా చేయాలి. సాయంత్రం డ్యూటీ తర్వాత మాత్రమే ప్రైవేట్ ప్రాక్టిస్ నడుపుకోవచ్చు. కానీ డాక్టర్ అరుణశ్రీ మాత్రం మధ్యాహ్నం 12 గంటల నుంచే ప్రైవేట్ క్లినిక్‌లో అందుబాటులో ఉంటారు. మరి పీపీ యూనిట్‌లో డ్యూటీలో ఎప్పుడు ఉంటారంటే.. ఏమైనా కేసులు ఉన్నప్పుడు, లేదా మీటింగ్‌లు ఉన్నప్పుడు మాత్రమే వచ్చి వెళ్తారట. వైద్యారోగ్య శాఖలో బాధ్యత గల వృత్తిలో పని చేయాల్సిన ఆమె వ్యవహారశైలి, ముందు నుంచి ఇంతేనని ఆమె పని చేసే ఆసుపత్రి వైద్యులు, సిబ్బందే స్వయంగా చెబుతున్నారు.

20 ఏళ్లుగా ఆ ఆసుపత్రిలోనే..

శ్రీ కిరణ్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో 20 ఏండ్లుగా ఈ మేడం పని చేస్తున్నారు. ఈ ఆసుపత్రిలో ఆమె భాగస్వామిగా ఉన్నట్లు తెలిసింది. వైద్యారోగ్యశాఖలో మెడికల్ ఆఫీసర్‌గా ఉన్నప్పటి నుంచి ఈ మేడం కిరణ్ హాస్పిటల్‌లో పని చేస్తున్నారు. ఏది ఏమైనా.. 12 గంటలు కొట్టిందంటే చాలు ఇక్కడ వచ్చి వాలిపోతారు. ఇది ఏళ్లుగా జరుగుతున్న వ్యవహారమే అయినా, అరుణశ్రీని అడిగే నాథుడే లేకుండా పోయారని కొందరు మండిపడుతున్నారు. నిన్న వైద్యం వికటించి మృతి చెందిన బాలింతకు ఉదయం 6 గంటలకు ఈ డాక్టరే ఆపరేషన్ చేశారు. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో బాలింత పరిస్థితి విషమించినట్లు గుర్తించి హుటాహుటిన మంచిర్యాలలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. దురదృష్టం కొద్దీ బాలింత మృతి చెందడంతో అసలు ఆపరేషన్ చేసి న డాక్టర్ ఎవరనేది.. అన్న విషయంపై దృష్టి పడింది. ఆ రా తీయగా ఆమె ప్రభుత్వ వైద్యురాలని, డ్యూటీకి సరి గా వెళ్లదని, ప్రైవేటు ఆసుపత్రిలోనే ఎక్కువ సమయం గడుపుతారని తెలిసింది. ఈ నేపథ్యంలోనే డాక్టర్ అరుణశ్రీ అని, ఆమె ప్రభుత్వ వైద్యురాలని తెలిసింది. నిబంధనల ప్రకారం డాక్టర్ అరుణశ్రీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎంసీహెచ్ విధు ల్లో ఉండాలి. కానీ మేడం మాత్రం ఏదైనా కేసులు ఉన్నప్పుడు, మీటింగ్‌లు ఉన్నప్పుడు మాత్రమే వస్తారని ఆమె సహచర వైద్యులు, సిబ్బంది చెబుతుండడం కొసమెరుపు. ఈ విషయమై జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి సుబ్బారాయుడుని వివరణ కోరగా.. ఏ డాక్టరైనా ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధుల్లో ఉండి తీరాలన్నారు. అరుణశ్రీ డ్యూటీ సరిగ్గా చేయదనే విషయం తమ దృష్టికి రాలేదన్నారు. అలాంటివేమైనా ఉంటే పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

గుట్టు చప్పుడు కాకుండా సెటిల్‌మెంట్..

వైద్యం వికటించి బాలింత మృతి చెందడంతో శ్రీ కిరణ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ యాజమాన్యం ఈ విషయాన్ని ఎలాగైనా బయటకు రాకుండా ఉంచేందుకు తీ వ్రంగా శ్రమించింది. ఈ క్రమంలోనే పోలీసు అధికారులకు ఆసుపత్రి నిర్వాహకులు భారీ మొత్తంలో డబ్బులు ముట్టజెప్పినట్లు సమాచారం. అందుకే పోలీసు యంత్రాంగం మొత్తం సోమ వారం చెన్నూర్ నుంచి మంచిర్యాల వరకు పహారా కాచింది. ఆసుపత్రి ముందు బాధితురాలు బంధువులు, ప్రజా సంఘాల నాయకులు ఆందోళనలు చేయకుండా భారీగా బలగాలను మోహరించారు. సీఆర్‌పీఎఫ్ బలగాలను పెట్టి ఆసుపత్రి చుట్టు పక్కల ఎవరూ తిరగకుండా చూశారు. కానీ అప్పటికే విషయం బయటకు పొక్కడంతో బాధితురాలి బంధువులతో యాజమాన్యం సెటిల్‌మెంటు చేసుకున్నట్లు తెలిసింది. ఇందుకోసం ఆ కుటుంబానికి రూ. ఆరున్నర లక్షలు ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయమై ఆసుపత్రి నిర్వాహకుడు లక్ష్మణ్‌ను వివరణ కోరగా.. టూడీ ఎకో టెస్టు చేయకుండా ఆపరేషన్ చేయడంతో సమస్య వచ్చిందన్నారు. మృతురాలికి అంతకుముందే గుండె సంబంధిత సమస్య ఉందని, ఆపరేషన్ అనంతరం ఆమె ఊపిరితిత్తులు పూర్తిగా దెబ్బతిన్నట్లు గుర్తించామన్నారు. హుటాహుటిన మంచిర్యాల ఆసుపత్రికి తరలించినప్పటికీ మార్గంమధ్యలోనే ఆమె తుదిశ్వాస విడిచిందని చెప్పారు. పోలీసు శాఖకు, బాధితులకు డబ్బులు ఇచ్చిన విషయంపై మాట్లాడటానికి ఇష్టపడలేదు. మొత్తం వ్యవహారంపై డాక్టర్ అరుణశ్రీని వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

కణతి తొలగింపు


కడుపులోంచి తొలగించిన కణతి

తాంసి, ఫిబ్రవరి 20 : ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని హస్నాపూర్‌కు చెందిన శ్రీజ ఈనెల 11న పాపకు జన్మనిచ్చింది. అయితే పుట్టిన పసికందు కడుపులో కణతి ఉన్నట్లు వైద్యులు గుర్తించి అత్యవసరంగా ఆపరేషన్ చేయాలని సూచించారు. మంగళవారం నీలోఫర్ ఆస్పత్రిలో పసికందుకు ఆపరేషన్ చేసి, కణతి తొలగించారు.

నేడు గూడెంలో సత్యదేవుడి కల్యాణం

దండేపల్లి, ఫిబ్రవరి 20 : గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో ఈ నెల 18వ తేదీ నుంచి కల్యాణ బ్రహ్మోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఈ మేరకు బుధవారం సాయంత్రం గోధూళిక సుముహూర్తమున రమాసహిత సత్యనారాయణస్వామి కల్యాణాన్ని వైష్ణవ సంప్రదాయం ప్రకారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. వేలాదిగా భక్తులు తరలిరానుండగా, అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. గుట్టపై ఉన్న సత్యదేవుని ఆలయం పక్కన స్వామివారి కల్యాణ వేదికలను ఏర్పాటు చేస్తున్నారు. ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్‌దీపాలు, పూల తోరణాలతో అలంకరించారు. కల్యాణాన్ని వీక్షించేందుకు ఎల్ఈడీ తెరలను ఏర్పాటు చేశారు. కల్యాణంలో ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు దంపతులు పాల్గొని స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు.

ప్రతిభను వెలికితీసేందుకే ట్యాలెంట్ టెస్టులు

నిర్మల్ డీఈవో రవీందర్‌రెడ్డి

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 20 : విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించి, వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకే సైన్స్ ట్యాలెంట్ టెస్టులను నిర్వహిస్తున్నామని డీఈవో రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నిర్మల్ పట్టణంలోని జేవీఎన్ఆర్ పాఠశాలలో జిల్లాస్థాయి సైన్స్ ట్యాలెంట్ టెస్ట్ పోటీలను నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందించారు. జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు త్వరలో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి వినోద్ కుమార్, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ పద్మ, సెక్టోరియల్ అధికారిణి శ్రీదేవి, సైన్స్ ఫోరం అధ్యక్షుడు నారాయణ వర్మ, బచ్చు శ్రీనివాస్, సత్యం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఈవో రవీందర్‌రెడ్డి